ఏమరుపాటు వద్దు..

- జాగ్రత్తలే ముద్దు
- పిచికారీలో శాస్త్రీయ పద్ధతులు తప్పనిసరి
- స్ప్రేయర్లను పరిశుభ్రం చేయాలి
- స్వీయ ఆరోగ్య రక్షణచర్యలు పాటించాలి



క్రిమిసంహారక మందును స్ప్రేయర్‌తో పిచికారీ చేస్తున్న రైతు

అలమూరు: ఖరీఫ్ సాగు దశలో దుబ్బు కట్టే మధ్యస్థ దశకు చేరుకుంటుంది. వరిసాగు సక్రమంగా జరగాలంటే భూమికి సరిపడా నీరు సక్రమంగా సమయానికి అందించాలి. అందుకోసం నీటి వనరుల లభ్యత, ఏ దశలో ఎంత మేరకు నీటి తడులు పెట్టాలన్న దానిపై రైతుకు అవగాహన కలిగి ఉండాలి. అదే విధంగా వరిసాగుకు అవసరమైన రీతిలో ఎరువులను చల్లి క్రిమి సంహారక మందులను పిచికారీ చేయాలి. క్రిమి సంహారక మందును పిచికారీ చేసే సమయంలో పంట సస్యరక్షణతో పాటు ఆరోగ్య రక్షణపైనా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఏమాత్రం ఏమరపాటుగా వ్యవహరించినా తీవ్రమైన అనారోగ్యం సంభవించే అవకాశం ఉంది. ఒక్కోసారి ప్రాణానికే ముప్పు వాటిల్లే ప్రమాదం కూడా ఏర్పడుతుంది. అలాగే క్రిమి సంహారక మందులను పిచికారీ చేసిన తరువాత స్ప్రేయర్లను పరిశుభ్రం చేసుకుని భద్రపర్చడం ద్వారా దీర్ఘకాలిక మన్నికతో పాటు స్ప్రే చేసే సమయం ఆదా అవుతుంది.

దుబ్బు దశలో వరిసాగు

క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లో ఖరీఫ్‌లో సుమారు 58 వేల ఎకరాల వరిసాగు జరుగుతుంది. ప్రస్తుతం క్లస్టర్ పరిధిలో కొత్తపేట నియోజకవర్గంలో వరిపంట దుబ్బుదశకు చేరుకోగా మిగిలిన ప్రాంతాల్లో నారుమడులు పూర్తయ్యాయి. ఈ సీజన్‌లో అనివార్య కారణాల వల్ల వరిసాగులో జాప్యం ఏర్పడటంతో నవంబర్ నెలలో పంట కోతకు వచ్చే అవకాశం ఉంది. ఈవరిసాగులో వరి నాట్లు వేసే నాటి నుంచి పంట చేతికి వచ్చే వరకూ రైతులు ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉంటూ వ్యవసాయశాఖ సూచనలకు అనుగుణంగా సాగులో మెళకువలు చేపట్టాలి. క్రిమిసంహారక మందుల పిచికారిలో డ్రస్ కోడ్ నిబంధనతో పాటు వ్యక్తిగత రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

అందుబాటులో బ్యాటరీ రీచార్జబుల్ స్ప్రేయర్లు

క్రిమి సంహారక మందు పిచికారీ చేసే స్ప్రేయర్లను సీజన్‌లో పలుమార్లు వినియోగించుకుని పని ముగిసిన తరువాత పక్కన పడేస్తారు. రైతుల్లో అనేక మంది ఈ విధంగా చేయడం వల్ల స్ప్రేయర్లు త్వరితగతిన దెబ్బతినే అవకాశం ఉంటుంది. స్ప్రేయర్లను పిచికారీ చేసిన తరువాత కనీస జాగ్రత్తలు తీసుకుని భద్రపరచుకుంటే సుదీర్ఘకాలం మన్నిక ఉండటంతో పాటు సమయం ఆదా అవుతుంది. పూర్వం రైతులు వినియోగించే మాన్యువల్ ఇత్తడి స్ప్రేయర్ల స్థానంలో ఆధునిక బ్యాటరీ రీచార్జబుల్ స్ప్రేయర్లు అందుబాటులోకి వచ్చాయి. పవర్ స్ప్రేయర్లతో పోలిస్తే బ్యాటరీ రీచార్జిబుల్ స్ప్రేయర్ల బరువు తక్కువగా ఉంటుంది. వేగంగా చేనుకు తగు మోతాదులో చిమ్ముతుంది.



అధునాతన స్ప్రేయర్లు

ఈ విధంగా భద్రపరచుకోండి

స్ప్రేయర్లను నీటితో పిచికారీ చేస్తూ పరిశుభ్రం చేయాలి. ప్రతి 15 రోజులకు ఒకసారి కనీసం ఒక గంట పాటు చార్జింగ్ పెడుతుండాలి. దీని ద్వారా బ్యాటరీ సామర్థ్యం దెబ్బతినకుండా ఉంటుంది. పవర్ స్ప్రేయర్ టర్బోరేటర్, ట్యాంకులోనూ పెట్రోల్ లేకుండా చూసుకోవాలి. ప్లగ్‌ను తీసి తరచూ పెట్రోల్‌తో శుభ్రపర్చాలి. పిస్టన్‌పై కొద్దిగా ఇంజిన్ ఆయిల్‌ను వేసి బిగించాలి. తైవాన్ స్ప్రేయర్లలో ఐదారు లీటర్ల నీరు పోసి నాజిల్ ద్వారా బయటకు స్ప్రే చేయాలి. దీని వల్ల స్ప్రేయర్‌లో చిక్కుకున్న మలినాలు బయటకు వచ్చేస్తాయి. హ్యాండ్ స్ప్రేయర్ల విషయంలో ఇత్తడి స్ప్రేయర్ గొట్టం తీసి అందులో కాస్త ఇంజిన్ ఆయిల్ పోసి బిగించాలి. దీనివల్ల తుప్పు పట్టకుండా ఉంటుంది. హైటెక్ స్ప్రేయర్లలో బుషులు, రాడ్లకు ఇంజిన్ ఆయిల్‌ను పూసి భద్రపరచాలి.

పిచికారీలో జాగ్రత్తలు అవసరం



క్రిమి సంహారక మందుల పిచికారీలో తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆధునాతన స్ప్రేయర్ల వినియోగంపై వ్యవసాయశాఖ సూచనలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలి. అలాగే స్ప్రేయర్లను ఎప్పటికప్పుడు పనితీరును పరిశీలన చేసుకోవాలి.

– బి.మీనా, ఏవో, ఆలమూరు

ప్రతి రోగికీ వైద్య సేవలు అందాలి

అంబాజీపేట: ఆసుపత్రికి వచ్చే వారే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రోగులకు పూర్తి స్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట పీహెచ్‌సీని శనివారం పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో ప్రజలు జ్వరాలు బారిన పడుతున్నారని అలాంటి వారిని గుర్తించి గ్రామాల్లో ఏఎన్ఎం, ఆశాలతో వైద్య సేవలు అందించాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులపై సానుకూలంగా వ్యవహరిస్తూ వైద్యం చేయాలన్నారు. ఆస్పత్రి చుట్టూ పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని త్వరలో తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రిలో వచ్చే రోగుల సంఖ్య, మందుల వివరాలను వైద్యాధికారి కేఎన్ శ్రీనివాస్‌ను ఎంపీపీ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, సీహెచ్‌వో బి.అప్పారావు పాల్గొన్నారు.

రోగి వైద్యానికి సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: పక్షవాతంతో అనారోగ్యానికి గురైన బాధితుడి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు శనివారం రూ.12 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండలంలోని ఊబలంక గ్రామానికి చెందిన అత్తిలి శ్రీనివాస్ (49) బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి నెల రోజులు క్రితం పెరాలసిస్ కారణంగా ఒక చెయ్యి, కాలు పని చేయడం లేదు. రాజమహేంద్రవరంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో కొంత వరకు వైద్యం చేయించి ఆర్థిక స్తోమత లేక ఇంటికి తీసుకువచ్చేశారు. కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరగా ఊబలంకలో శ్రీనివాస్ ఇంటికి వెళ్లి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.12 వేల చెక్కు అందజేశారు.

లోవోల్టేజీ సమస్యను పరిష్కరించండి

అంబాజీపేట: చాలా కాలం నుంచి లోవోల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని తక్షణమే పరిష్కరించాలని చిరతపూడి వాసులు కోరుతున్నారు. లోవోల్టేజీ కారణంగా ఇంటిలో ఉన్న విద్యుత్ దీపాలు వెలగక, ఫ్యాన్లు తిరగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. రాత్రి సమయంలో ఫ్యాన్లు పనిచేయక వేడిని తాళలేక వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారని వాపోయారు. లో వోల్టేజీ సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరినప్పటికీ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

డిగ్రీ గణిత అతిథి అధ్యాపకుని పోస్టుకు దరఖాస్తులు

కొత్తపేట: స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మ్యాథమెటిక్స్ సబ్జెక్ట్ బోధించుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు తెలిపారు. ఆ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మ్యాథమెటిక్స్‌కు సంబంధించి పీజీలో 55 శాతం మార్కులు కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులు ఈనెల 5వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు కళాశాల కార్యాలయంలో సమర్పించాలని కోరారు. 6 వ తేదీ ఉదయం 11 గంటలకు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హతలు కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇతర వివరాలకు 9849711253, 9989027808 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

సేవా సంస్థల దృక్పథం అభినందనీయం



రావులపాలెంలో బోర్‌వెల్ ప్రారంభించిన సర్పంచ్ మునిరెడ్డి

రావులపాలెం: స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు పరిష్కరించడంలో జీఐఐ వంటి సేవా సంస్థల సేవా దృక్పథం అభినందనీయమని రావులపాలెం గ్రామ ఉపసర్పంచ్, సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు గొలుగూరి మునిరెడ్డి అన్నారు. స్థానిక బండిరేవు పుంత వార్డులో శామ్యూల్ స్థలంలో జీసీఐ సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన బోర్‌వెల్‌ను శనివారం ఉప సర్పంచ్ మునిరెడ్డి ప్రారంభించారు. స్థానిక పెద్దల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మునిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడ ప్రజల మంచినీటి సమస్యను పరిష్కరించిన జీసీఐ సంస్థ ప్రతినిధులను అభినందించారు. తమ దృష్టికి వచ్చిన వెంటనే గ్రామ పంచాయతీ స్థాయిలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మునిరెడ్డిని స్థానికులు ఘనంగా సత్కరించారు.

నల్లతాచు హల్‌చల్



ఇసుకపూడిలో వంట గదిలో బుసలు కొడుతున్న నల్లతాచు

అంబాజీపేట: ఇసుకపూడి గ్రామంలో తాటికాయల నాగేశ్వరరావు ఇంటిలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో నల్లతాచు హల్‌చల్ చేసి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేసింది. నాగేశ్వరరావు వంట గదిలో నల్లతాచు బుసలు కొడుతూ కనిపించడంతో భయాందోళనకు గురయ్యారు. దాంతో భీమనపల్లికి చెందిన స్నేక్‌క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం అందించారు. వర్మ పామును చకచక్యంగా పట్టుకుని ప్లాస్టిక్ డబ్బాలో బంధించి జనసంచారం లేని ప్రాంతంలో విడిచిపెట్టారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు



మందపల్లి శనైశ్చర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మండలంలోని మందపల్లిలో ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని భక్తులు శనైశ్చరా శరణు.. శరణు అంటూ వేనోళ్ల కొలిచారు. శనివారం స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి ప్రాతఃకాల అర్చన అనంతరం భక్తులు తైలాభిషేకాలు, సర్వదర్శనాలు చేసుకున్నారు. దేవస్థానం ఈఓ దారపురెడ్డి సురేష్‌బాబు ఆధ్వర్యంలో దేవస్థానం సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు. టిక్కెట్లు, వివిధ సేవల ద్వారా రూ.1,38,065 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. అలాగే అన్నప్రసాద పథకానికి పలువురు భక్తుల ద్వారా విరాళాల రూపంలో మరో రూ.24,434 రాగా మొత్తం 1,62,499 ఆదాయం వచ్చినట్టు ఈఓ సురేష్‌బాబు తెలిపారు. ఆయన తెలిపారు. సిబ్బంది, పలువురు గ్రామస్తులు భక్తులకు అన్నప్రసాద సేవలో పాల్గొన్నారు.

దాతల సహకారంతో మౌలిక సదుపాయాలు

మామిడికుదురు: దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పడుతున్నాయని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. మామిడికుదురు జెడ్పీహెచ్ స్కూల్ ప్రాంగణంలో రూ.35 లక్షలతో నిర్మించిన డాక్టర్ భూపతి నాగేశ్వరరావు మెమోరియల్ డైనింగ్ హాల్‌ను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సభలో మాట్లాడుతూ పేదల డాక్టరుగా దివంగత భూపతి నాగేశ్వరరావు స్థానికంగా ఎంతో ప్రాచుర్యం పొందారన్నారు. అతని మరణానంతరం అతని కుటుంబ సభ్యులు స్మారక భవనం ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీవైఈఓ సూర్యప్రకాష్, ఎంఈఓ మోకా వెంకన్నబాబు, హెచ్ఎంలు బి.చిరంజీవిరావు, పీహెచ్ నిరంజని, ఎంపీపీ కుసుమ వనజకుమారి, సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, ఎంపీటీసీలు నయినాల సీతామహాలక్ష్మి, వర్థినేని రాము తదితరులు పాల్గొన్నారు.



మామిడికుదురులో డైనింగ్ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

చంద్రబాబుది మోసపూరిత ధోరణి



మడుపల్లిలో కరపత్రాలతో ప్రజలకు వివరిస్తున్న కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు

- కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు
- మూడు గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ

అయినవిల్లి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు మొదటి నుంచి ప్రజలను మోసగించడంలో సిద్ధహస్తుడని, అతడి మోసపూరిత హామీలు నమ్మి రాష్ట్ర ప్రజలు పోయారని ఆ మోసాలను రాష్ట్ర ప్రజలు త్వరలోనే ఎండగడతారని పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం మడుపల్లి, అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం గ్రామాల్లో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మేడిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీలో భాగంగా రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఏడాదిగా ప్రజలకు కూటమి ఇచ్చిన హామీల అమలుపై ప్రజలను గన్నవరపు, పార్టీ నాయకులతో వారిని అడిగి తెలుసుకున్నారు. సూపర్‌సిక్స్ హామీలు అమలు చేస్తున్నారా.. అని అడిగారు. దీనికి ప్రతిగా మహిళలు జగన్ మోహన్‌రెడ్డి హయాంలోనే అడగకుండా పథకాలు అందేవని చెప్పారు. కూటమి పాలనలో అర్హత ఉన్నా తమకు ఏదోఒక విధంగా పథకాలను ఎగ్గొట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించుకుంటామని అన్నారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, అంబాజీపేట మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, సానబోయిన నాగేశ్వరరావు, మిండగుదిటి రాంబాబు, బుడిద వరలక్ష్మి, కొనే చంద్రశేఖర్, పినిపే బుజ్జి, చల్లాబత్తుల శ్రీను, బొంతు శ్రీను, వాసంశెట్టి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ నియామకం



విశ్వేశ్వరాయపురం నూతన కమిటీతో జడ్పీటీసీ బల్ల ప్రసన్న కుమారి

మలికిపురం: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాజోలు నియోజకవర్గం ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో ఎన్నికల పరిశీలకుడిగా నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు గుర్రం జాషువా పర్యవేక్షణలో మలికిపురం మండల విశ్వేశ్వరాయపురం వైఎస్సార్ సీపీ గ్రామశాఖ నూతన కార్యవర్గం ఎంపిక శనివారం జరిగింది. నూతన గ్రామశాఖ అధ్యక్షుడిగా గుబ్బల రమేష్ ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులుగా నల్లి సత్య, వాడపల్లి పల్లయ్య, కారుపల్లి చంటి, ఆకుమర్తి నాగేశ్వరరావు, పాదలాడ శ్రీనివాస రావు, తోట లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు గుబ్బల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి పాల్గొని మాట్లాడుతూ పార్టీ అధికారంలోనికి రావడమే లక్ష్యంగా కార్యకర్తలంతా ముందుకు సాగుదామన్నారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జాతికి జెండా ఇచ్చిన మహనీయుడు పింగళి

కొత్తపేట: భారత జాతికి జెండా ఇచ్చిన మహనీయుడు పింగళి వెంకయ్య అని విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ డీసీహెచ్ పాపారావు అన్నారు. కళాశాల హిస్టరీ విభాగం ఆధ్వర్యంలో జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పాపారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ జెండా గురించి, పింగళి వెంకయ్య గొప్పతనాన్ని గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.సత్యనారాయణ, కె.అంకమరావు, సీహెచ్ నాగరాణి, సాయి కృష్ణ, విజయ్ కుమార్, నాగ దీపిక, నాగ శ్రీలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.



పింగళి వెంకయ్యకు నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ పాపారావు, అధ్యాపకులు, విద్యార్థులు

'సుఖీభవ' నమూనా చెక్కుల పంపిణీ

అలమూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్ పథకం పంపిణీలో ఎమ్మెల్యే బండారు, ఆర్డీఓ పి.శ్రీకర్ పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఎమ్మెల్యే బండారు నమూనా చెక్కును రైతులకు అందజేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సంబంధించి 23,118 మంది రైతులకుగాను రూ.16.11 కోట్ల చెక్కును ఆవిష్కరించారు. అలాగే తొలుత స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.ఎనిమిది లక్షలతో నిర్మించే ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేశారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని రైతులతో శనివారం పి.గన్నవరం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే గిడ్డి మాట్లాడారు. ఈ పథకం కింద నియోజకవర్గంలోని 23,727 మంది రైతులకు రూ.16.31 కోట్లను నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు.



ఆలమూరులో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నమూనా చెక్కు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహిద్దాం

ఆలమూరు: తల్లిపాల సంస్కృతిని గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించి శిశువులకు మెరుగైన ఆరోగ్యాన్ని, వ్యాధి నిరోధకశక్తిని పెంపొందించాలని పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి కె.భాగ్యశ్రీ అన్నారు. మండల కేంద్రమైన ఆలమూరు, నర్సిపూడి, చెముడులంక సెక్టార్ల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు టీఎన్‌వీ నాగలక్ష్మి, వై.అరుంధతి, బి.వరలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ వారోత్సవాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొని తల్లిపాల విశిష్టతను తెలియజేశారు. తల్లిబిడ్డల ఆరోగ్య దృష్ట్యా తల్లులందరూ పుట్టిన శిశువుకు అరగంటలోపే ముర్రుపాలు అందించాలన్నారు. చిన్నారులకు తల్లిపాలు సక్రమంగా అందకపోవడం వల్ల పౌష్టికాహార లేమి ఉత్పన్నమై తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారన్నారు. తల్లిపాలలో ప్రొటీన్లు, రోగ నిరోధక శక్తిని పెంచే విటమిన్లు అధికశాతం ఉంటాయన్నారు. 'డబ్బా పాలు వద్దు–తల్లి పాలు ముద్దు' అంటూ నినాదాలు చేశారు. దీంత పాటు తల్లిపాలు త్వరితగతిన జీర్ణమై శిశువు ఎదుగుదలకు తోడ్పడతాయన్నారు. ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది

ప్రమాదం జరగక ముందే తొలగించండి

కొత్తపేట: మండలంలోని మందపల్లి పెద్ద వంతెన సమీపాన లారీ కాటా ఎదురుగా ఒక చెట్టు ఎండిపోయి ఎప్పుడైనా విరిగిపడేందుకు సిద్ధంగా ఉంది. ప్రస్తుతం తుపాను ఈదురుగాలులకు విరిగిపడేలా ఊగుతూ రోడ్డుపై వెళ్లే ద్విచక్ర, ఇతర వాహనాదారులను భయభ్రాంతులకు గురిచేస్తుంది. ఎప్పుడైనా విరిగిపడేట్టుగా ఉంది. ఏ విధమైన ప్రమాదం సంభవించక ముందే ఆర్ అండ్ బీ, ఫారెస్ట్ అధికారులు స్పందించి, ఎండిన చెట్టును తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు కోరారు. అలాగే రావులపాలెం–కొత్తపేట ఆర్అండ్‌బీ రహదారిలో అనేకచోట్ల రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లకొమ్మలు పెరిగిపోయి కిందికి వేలాడుతూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉన్నాయి. బుధవారం దేవరపల్లి శివారు పెంకులపాటిగరువు–జానకమ్మరావి పెట్రోలు బంకు మధ్య ఒక లారీకి పెద్ద చెట్టు కొమ్మ తగిలి విరిగి రోడ్డుపై పడిపోయింది. అదృష్టవశాత్తూ ఆ లారీ వెనుక మరే వాహనం గాని, ద్విచక్ర వాహనదారులు గాని రాలేదు. వచ్చి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేది. అయితే కొంతసేపు ట్రాఫిక్ జామ్ అయింది. ఈ రహదారిలో సుమారు 10 కిలోమీటర్ల మేర లారీలు, బస్సులకు తగిలే విధంగా కిందికి వాలిన చెట్ల కొమ్మలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు వాహనదారులు, స్థానికులు ఆర్అండ్‌బీ, ఫారెస్ట్ అధికారులను కోరారు.



మందపల్లి సమీపంలో విరిగిపడే విధంగా వాలిన చెట్ల కొమ్మలు



మందపల్లి వద్ద ఎండిపోయిన చెట్టు

విద్యుత్ చార్జీల దోపిడీపై ధర్నా

తాళ్లరేవు: విద్యుత్ చార్జీల నిలువు దోపిడీని ఆపాలని, ప్రమాదకర స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని మండల ప్రజావేదిక నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ఈనెల 5న తాళ్లరేవు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద జరిగే ధర్నాకు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కరపత్రాలను అందజేశారు. ప్రజావేదిక నాయకుడు ఈశ్వరరావు మాట్లాడుతూ, అక్రమ ఒప్పందాలు, అవినీతి చర్యలతో ఖర్చులు పెంచి ప్రజల నుంచి ఈ సర్దుబాటు చార్జీలు వసూలు చేయడం అన్యాయమన్నారు. ప్రజలు వినియోగించే విద్యుత్ యూనిట్లకు అదనంగా సర్వీస్ చార్జీలు, ట్రూఅప్ చార్జీలు, డవలప్‌మెంట్ చార్జీల పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు. ఆయా డిమాండ్లతో ఈ నెల 5న నిర్వహించే ధర్నాకు ప్రజలు హాజరుకావాలన్నారు.

అంతరిక్షానికి పరుగులు పెట్టేలా నాసా ప్రోగ్రాం



సర్టిఫికెట్లు అందుకున్న మొగలికుదురు విద్యార్థులు

మామిడికుదురు: భూ మండలం నుంచి ఆకాశ మండలానికి విద్యార్థులు చేరుకుని అంతరిక్షానికి పరుగు పెట్టే విధంగా తయారు చేయడం కోసం శ్రీచైతన్య విద్యాసంస్థ నాసా ప్రోగ్రాంను ఏర్పాటు చేసింది. దీనిపై మొగలికుదురు స్కూల్లో శనివారం జరిగిన సమావేశంలో రాజోలు కళాశాల అధ్యాపకులు వి.కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు తమ సృజనను సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి చక్కని ఆవిష్కరణలు చేసేందుకు నాసా ప్రోగ్రాం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.బాలాజీ, అకడమిక్ డీన్ రమేష్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వెనుకబడిన వర్గీయుల అభ్యున్నతికి కృషి

కపిలేశ్వరపురం (మండపేట): నియోజకవర్గంలో వెనుకబడిన సామాజిక వర్గీయుల అభ్యున్నతికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా నియమితులైన మండపేట పట్టణానికి చెందిన యాండ్ర ప్రభాకరరావు (బుజ్జి) తెలిపారు. తనకు బాధ్యతలను అప్పగించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పర్యవేక్షణలో పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

విద్యారంగంపై ప్లీనరీలో చర్చ

తాళ్లరేవు: కాకినాడలో ఈనెల 3, 4 తేదీల్లో ఎస్ఎఫ్ఐ నిర్వహించనున్న జిల్లా ప్లీనరీ సమావేశాలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం ప్లీనరీ పోస్టర్‌ను విడుదల చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గంగా సూరిబాబు మాట్లాడుతూ, విద్యారంగ సమస్యలపై నిరంతరం రాజీలేని పోరాటం నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశాలకు ప్రతి ఒక్కరూ హాజరుకావాలన్నారు. నూతన జాతీయ విద్యావిధానాన్ని రాష్ట్రంలో అమలు చేయడం వల్ల విద్య మొత్తం ప్రైవేటీకరణ అవుతుందన్నారు. రాష్ట్రంలో నేటికీ డిగ్రీ అడ్మిషన్స్ ప్రారంభించకుండా విద్యార్థులను చదువుకు దూరం చేసేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. విద్యారంగం అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై ప్లీనరీలో చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కళాశాల నాయకులు సంధ్యారాణి, అపర్ణ, నాగదుర్గ తదితరులు పాల్గొన్నారు.